# డ్రామ



**తెలిదేవర భానుమూర్తి**

## ఎన్నిక(థ)లు

గాయిన రాజకీయాలకు దూరమయ్యిండు. పెండ్లాం పిల్లలను గూడ ఇడ్సి పెట్టిండు. ఊరవుతల ఒక గుడిసె ఏస్కోని ఉంటుండు. సన్నాసి అయినంక గూడ రాజకీయ ఆసలు గాయినను ఇడ్వలేదు. గాయిన తాన్కి ఎవ్వలు బోయినా రాజకీయాల గురించి మాట్లాడ్తుంటడు. గాయిన అసలు పేరును అందరు మర్సి పోయిండ్రు. గాయినను అందరు రాజకీయ సన్నాసి అని పిలుస్తుంటరు. గాయినకు శిష్యులు గూడ ఉన్నరు. శిష్యులల్ల ఇస్తారి అంటె గాయినకు శాన ఇస్టం. యాడికి బోయినా గాయిన ఇస్తారి తన యెంబడి దోల్కబోతుంటడు. దినాం ఇస్తారి రాజకీయ సన్నాసి గుడిసెకు బోతుంటడు. నడీ రాత్రి దాంక సన్నాసితోని ముచ్చట బెట్టుకుంట గూసుంటడు. ఒక్కోపారి రాత్రి పూట సన్నాసి గుడిసెలనే బంటడు. ఇంట్ల పెండ్లాం ఎంత మొత్తుకున్నా గాడు ఇనడు. చెప్పిచెప్పి యాస్టకొచ్చి ఇస్తారి పెండ్లాం తల్లిగారింటికి బోయింది. పెండ్లాం తల్లిగారింటికి బోంగనే ఇస్తారి చెంగున ఎగిరిండు. ఇంటికి తాలం బెట్టిండు. సక్కగ రాజకీయ సన్నాసి గుడిసెకు బోయిండు. బోవుడే గాకుంట గా గుడిసెలనే ఉండబట్టిండు.

గా దినం సన్నాసికి పక్క ఊరికి బోయే పని బడింది. సన్నాసి ఊరికి బోతుండని ఎర్కగాంగనే–

"నేను గూడ మీ తోని వొస్త" అని ఇస్తారి అన్నడు.

"నేను పల్లెటూరుకు బోతున్న. గా ఊరుకు బోయె తందుకు బస్సు గూడ లేదు. నడ్సి బోవాలె" అని సన్నాసి అన్నడు.

"నేను గూడ మీతోని నడ్సు కుంట వొస్త. గుడిసెల ఒక్కని గూసోని ఏం జెయ్యాలె" అని ఇస్తారి అన్నడు.

"మంచిది నా యెంట రా! ఇద్దరం గల్సి ముచ్చటబెట్టుకుంట ఊరికి బోవచ్చు" అని సన్నాసి అన్నడు.

ఇద్దరు గింత దిన్నరు. నద్మల దూపైతె తాగేతందుకు ఒక సీసల నీల్లు బోస్కున్నరు. గా సీసను దీస్కోని నడ్సు కుంట ఊరికి బోబట్టిండ్రు. పోతుంటె–

"ఏదన్న ఒక కత జెప్పుండ్రి" అని ఇస్తారి, సన్నాసిని అడిగిండు.

"ఏ కత జెప్పుమంటవు?" అని సన్నాసి అన్నడు.

"ఎప్పుడు జెప్పేటి కతలే జెప్పుండ్రి" అని ఇస్తారి అన్నడు.

"రాజకీయ కత జెప్పుమంటవు" అని సన్నాసి అన్నడు.

"అవ్" అని ఇస్తారి అన్నడు.

"నువ్వు అడ్గిన తీర్గ రాజకీయ కతనే జెప్త. ఎలచ్చన్లు వొచ్చినయి. ఎమ్మెల్యే టికిట్ల గురించి లీడర్లు పైరవీలు జెయ్యబట్టిండ్రు. సత్నారి అనేటి ఒక లీడర్ ఉన్నడు. గాయిన ఎమ్మెల్యే టికిట్ కోసం ఒక్కతీర్గ కోషిస్ జెయ్యబట్టిండు. దేవుల్లకు మొక్కిండు. వారానికి ఒక దినం ఉపాసమున్నడు. గాయిన పెండ్లాం గూడ టికిట్ నోముబట్టింది. వాడకట్టోల్లందరికి పసుబ్బొట్టు ఇచ్చింది. నా మొగనికి ఎమ్మెల్యే టికిట్ దొర్కితె తిర్పతికి బోయి గుండు గొట్టిచ్చుకుంట అని గామె మొక్కింది. సత్నారి అందరి మంచిచెడ్డలు అర్సుకోబట్టిండు. ఎవ్వలి కన్న జెరమొస్తె దవకానకు దోల్క బోబట్టిండు. గుడిసెల ఉన్న కూలోల్ల తాన్కి బోబట్టిండు. గాల్ల పక్కపంటి గూసోని బువ్వ దినబట్టిండు. వారానికి ఒక్క పారి పట్నం బోబట్టిండు. పార్టి ప్రెసిడెంటును గల్వబట్టిండు. గల్సి మస్క గొట్టబట్టిండు. ఎన్ని తీర్ల కోషిస్ జేసినా పాయిద లేకుంట బోయింది. ఎమ్మెల్యే టికిట్ గానికి గాకుంట ఇంకొకల్లకు ఇస్తున్నరని సత్నారికి ఎర్కైంది. ఎర్కగాంగనే ఏదన్న ఒకటి జెయ్యాలని గాడు అనుకున్నడు. పదిపదిహేను లారీలను కిరాయికి దీస్కున్నడు. గా లారీలల్ల జెనంను ఎక్కిచ్చిండు. ఎక్కిచ్చి పట్నం దోల్క బోయిండు. జెనంతోని ఉన్న లారీలన్ని సక్కగ పార్టి ఆపీసు కాడ్కి దీస్కబోయిండు. సత్నారి జిందాబాద్, సత్నారికి ఎమ్మెల్యే టికిట్ ఇయ్యాలె అన్కుంట జెనం లాసిగ వొల్ల బట్టిండ్రు.

ఇంతల యాడికెల్లి వొచ్చిందో ఏమో గని ఒకామె జెనం నడ్మిట్లకు ఉరికొచ్చింది. గామె చేత్ల గ్యాంచునూనె డబ్బ ఉన్నది. సత్నారికి ఎమ్మెల్యే టికిట్ ఇయ్యాలె అని లాసిగ వొల్లింది.

"సత్నారికి ఎమ్మెల్యే టికిట్ ఇయ్యకుంటె ఏం జేస్తవు?" అని జెనంల ఒకడు గామెను అడిగిండు.

"సత్నారికి ఎమ్మెల్యే టికిట్ ఇయ్యకుంటె తల్లబడి సస్త" అని గామె అన్నది.

"సావొద్దు. సావొద్దు" అని జెనం అన్నరు.

"లే. నేను సస్త" అన్కుంట గామె డబ్బల ఉన్న గ్యాంచు నూనెను మీద గుమ్మరిచ్చుకున్నది.

అగ్గిపుల్లల డబ్బి దీస్కున్నది.

"వొద్దు. వొద్దు" అన్కుంట జెనం గామెను బట్టుకున్నరు.

"ఇడ్వుండ్రి. నేను సస్త" అని గామె గుంజులాడబట్టింది.

"గిట్ల అద్దగంట సేపు కత నడ్సింది. పోట్వలు దీసెటోల్లు గామె పోట్వలు దీస్కున్నరు. గా గురించి వార్తలు రాస్కునేటోల్లు వార్తలు రాస్కున్నరు. ఇంతకు గామె నిజంగనే సచ్చిందా? గామె సచ్చినంక సత్నారికి ఎమ్మెల్యే టికిట్ వొచ్చిందా?" అని సన్నాసి ఇస్తారిని అడిగిండు.

"గామె పెయ్యిమీద గ్యాంచు నూనె బోస్కున్నది. పుల్లల పెట్టె దీస్కున్నది. గని అగ్గిపుల్ల గీకలేదు. సస్తనని బెదిరిచ్చింది. గని సావలేదు" అని ఇస్తారి అన్నడు.

"గామె సావకుంటె సత్నారికి ఎమ్మెల్యే టికిట్ దొర్కిందా లేదా?" అని సన్నాసి అడిగిండు.

"సత్నారికి ఎమ్మెల్యే టికిట్ దొర్కలేదు. సత్నారి లారీలనే గాకుంట జెనంను గూడ కిరాయికి దెచ్చిండు. గ్యాంచునూనె బోస్కోని తల్లబడి సస్త అని అన్న ఆమె గూడ కిరాయి మనిసే.

గ్యాంచు నూనె పెయ్యి మీద గుమ్మరిచ్చుకోని తల్ల బడి సస్త అన్కుంట గామె డ్రామ ఆడింది. గా డ్రామకు పార్టి ప్రెసిడెంట్ బెదిరి ఎమ్మెల్యే టికిట్ ఇస్తడని సత్నారి అనుకున్నడు. గని ఇంతకు ముందు గిసువంటి డ్రామలను ఎన్నిటినో పార్టి ప్రెసిడెంట్ ఆడిపిచ్చిండు. సత్నారి ఆడామె తోని డ్రామ ఆడిపిచ్చిండని ఎర్కుండ బట్కె గానికి పార్టి ప్రెసిడెంట్ ఎమ్మెల్యే టికిట్ ఇయ్యలేదు" అని ఇస్తారి జెప్పిండు.

●